క్లుప్తంగా

కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం



అల్లూరు: మండలంలోని తూర్పుగోగులపల్లికి చెందిన గీత కార్మికుడు గుడిపల్లి మల్లికార్జునకు జిల్లా గౌడ సేవా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆదివారం రూ.10 వేలు సాయం అందజేశారు. ఇటీవల మల్లికార్జున తాటిచెట్టు ఎక్కి కల్లుగీస్తూ ప్రమాదవశాత్తు పడిపోయి గాయాలపాలయ్యాడు. ఈ నేపథ్యంలో మల్లికార్జునను రాజశేఖర్‌గౌడ్ పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట గౌడ సంఘ నాయకులు తోట ప్రభాకర్‌గౌడ్, రామకృష్ణయ్యగౌడ్, రావుల రంగయ్యగౌడ్, గోవిందగౌడ్, యానాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆండాళ్ తాయార్ ఉత్సవాలు



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ తాయార్ ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం తిరుమంజనం, సాయంత్రం ప్రాకారోత్సవం, మాలమార్పు, రాత్రి ఊంజల్‌సేవ వేడుకగా జరిగింది. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా కాంతమ్మ వ్యవహరించారు. కార్యక్రమాలను దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు

శేషజీవితం హాయిగా సాగాలి



నెల్లూరు(అర్బన్) : వైద్యారోగ్య శాఖలో 40 ఏళ్ల పాటు విశేష సేవలందించిన ఏటూరి జయశ్రీ శేషజీవితం హాయిగా సాగాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. విడవలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన జయశ్రీని నెల్లూరు నగరంలోని హంస కార్యాలయంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడారు. ఆమెకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే వచ్చేలా డాక్టర్లు చూడాలన్నారు. కార్యక్రమంలో హంస గౌరవ మహిళా అధ్యక్షురాలు ఇందిర, విశ్రాంత డాక్టర్ మున్వర్‌సుల్తానా, జాయింట్ సెక్రటరీ ఉమామహేశ్వర్, నాయకులు రవిచంద్ర, రవీంద్ర, సుధాకర్, లక్ష్మణ్, శైలజ, వారజ, సుశీల, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 11న గణేశ్ నిమజ్జనోత్సవం

నెల్లూరు(బృందావనం) : వినాయక చవితి వేడుకల్లో భాగంగా సెప్టెంబర్ 11న నగరంలో సామూహిక గణేశ్ నిమజ్జనోత్సవం నిర్వహిస్తున్నట్లు విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి తెలిపింది. నగరంలోని ట్రంకు రోడ్డులో ఉన్న టీవీఎస్ కల్యాణ సదన్‌లో విక్రమ సింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని సమితి అధ్యక్షుడు పిట్టి సత్యనాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలను సెప్టెంబర్ 7 నుంచి 11వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. చివరి రోజు జరిపే గణనాథుల విగ్రహాల నిమజ్జనోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతేడాది మాదిరిగానే విక్రమసింహపురి గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సింగిల్ విండో ద్వారా మున్సిపల్, పోలీసు, విద్యుత్ తదితర శాఖల అధికారుల నుంచి అనుమతులు అందజేస్తామన్నారు. ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేలూరు మహేష్, ప్రధాన కార్యదర్శి పి.సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమావేశం



నెల్లూరు(దర్గామిట్ట) : ఉమ్మడి నెల్లూరు జిల్లా జెడ్పీటీసీ సభ్యుల ఆత్మీయ సమావేశం నగరంలోని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నివాసంలో ఆదివారం జరిగింది. సమావేశంలో మాజీ ఎన్‌డీసీసీబీ చైర్మన్ ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడో?

- విస్తరణకు నోచుకోని ట్రంకురోడ్డు
- ఆక్రమణలకు గురైన మార్జిన్లు
- రోడ్డుపైనే వాహనాల పార్కింగ్
- నిత్యం ట్రాఫిక్‌తో వాహనచోదకుల అవస్థ



కావలి ట్రంక్‌రోడ్డులో ట్రాఫిక్ రద్దీ

కావలి: పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ట్రంకు రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడం..ఇరువైపులా రోడ్డు మార్జిన్లు ఆక్రమణలకు గురికావడం..రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తుండడం..తదితర కారణాలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనచోదకులు సతమతమవుతున్నారు. పట్టణంలోని ట్రంకు రోడ్డుకు వందేళ్ల చరిత్ర ఉంది. గతంలో మద్రాసు–కలకత్తా జాతీయ రహదారిగా ఉన్న ఈ రోడ్డును గ్రాండ్ ట్రంక్ రోడ్డుగా జాతీయ రహదారుల సంస్థ పిలుస్తుండేది. కాగా జాతీయ రహదారిపై వాహనాల రద్దీ పెరగడంతో పట్టణ పొలిమేరల మీదుగా మళ్లించి నూతన బైపాస్ రోడ్డును నిర్మించారు. ఆ తరువాత పట్టణ పరిధిలోని ట్రంకురోడ్డు ఆర్‌అండ్‌ బీ శాఖకు బదిలీ అయింది. గతంలో మద్రాసు–కలకత్తా జాతీయ రహదారిలో భాగమైన కావలి పట్టణంలోని ట్రంక్‌రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండేవి. అప్పట్లోనే ఇరుకుగా ఉండే ఈ రోడ్డులో నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునేవి. ఈ క్రమంలో కావలికి బైపాస్ రోడ్డు నిర్మించి పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా నివారించాలనే డిమాండ్ ప్రజల నుంచి వచ్చింది. అదే సమయంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కావలికి బైపాస్‌రోడ్డు నిర్మించడంతో భారీ వాహనాల రాకపోకలు తగ్గి ట్రాఫిక్ సమస్య కొంత మేర తగ్గింది.

మళ్లీ మొదటికొచ్చిన సమస్య

పట్టణాభివృద్ధితో వాహనాల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉన్న కావలి పట్టణానికి వందలాది గ్రామాలకు చెందిన ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం వస్తుంటారు. దీంతో పట్టణంలోకి వచ్చే బైక్‌లు, కార్లు వేల సంఖ్యలో పెరిగిపోయి ట్రాఫిక్ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.9 కోట్లు మంజూరు చేయగా ట్రంక్‌రోడ్డును కొంత మేర విస్తరించారు. దీంతో ట్రాఫిక్ పరిస్థితి కాస్త మెరుగైంది. అయితే రాష్ట్రం విడిపోయిన తర్వాత విజయవాడ, గుంటూరు నగరాలు రాజధాని ప్రాంతం కావడంతో కావలి పట్టణంలో మళ్లీ వాహనాల రద్దీ ఏర్పడింది. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల ప్రజలు రాజధాని నగరాలకు కావలి మీదుగా రాకపోకలు ప్రారంభించారు. అలాగే కావలి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, కావలి పట్టణంలోని ప్రజల వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి.పట్టణానికి చెందిన వాహనాలే కాకుండా బయట నుంచి వచ్చి పోయే వాహనాలు రోజుకు పదివేలకుపైగా ఉంటాయని అంచనా. దీంతో పట్టణంలోని ట్రంక్‌రోడ్డు రద్దీగా ఉంటూ ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యమైపోయింది. ట్రంక్‌రోడ్డుకు ఇరువైపులా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ట్రంక్‌రోడ్డు పాదచారులు, వాహనాలతో కిక్కిరిసి ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారుతోంది.

రూ.51.5 కోట్లతో ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి గత ప్రభుత్వ హయాంలో ట్రంక్‌రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అప్పటి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కలిసి ట్రాఫిక్ సమస్యను విన్నవించగా రూ.51.5 కోట్లతో ట్రంకు రోడ్డు విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం సిమెంట్ రోడ్డు ఉన్న ప్రాంతం వరకు ఆరు వరుసల సిమెంట్‌రోడ్డు, తారు రోడ్డు ఉన్న ప్రాంతాల్లో నాలుగు వరుసల తారురోడ్డు నిర్మాణం, ఇరువైపులా డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టేలా కాంట్రాక్ట్ సంస్థకు పనులు అప్పగించారు. పట్టణ ఉత్తర శివార్లలో ఉన్న మద్దూరుపాడు నుంచి దక్షిణ శివార్లలోని ముసునూరు వరకు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే పట్టణానికి దక్షిణ వైపున డ్రైనేజీ కాలువ కొంత వరకు నిర్మించారు. ఉత్తర వైపున మద్దూరుపాడు వైపు కొంత మేర పనులు జరిగాయి. అయితే ప్రధానంగా ట్రాఫిక్ సమస్య ఉన్న ట్రంక్‌రోడ్డులో మాత్రం రోడ్డు విస్తరణ పనులు మొదలు కాలేదు. దీంతో ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడోనని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



సోమశిల: ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో అనంతసాగరం మండలం లక్కరాజుపల్లి, శంకరనగరం, బండారుపల్లి, రేవూరు గ్రామాల్లో త్రైత సిద్ధాంతంపై ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీతలను పంచారు. పాదలకూరు కమిటీ అధ్యక్షుడు జీ పెంచల నరసయ్య, సభ్యులు బీ కృష్ణయ్య, ఎం కొండయ్య, పెంచలయ్య, శేషాద్రి, వై పెంచలయ్య, ఎంసీ సుధాకరాచారి, నాగేంద్ర, మురగళ్ల కృష్ణయ్య, పీ మధు, పీ కిషోర్, పీ జాహ్నవి, పీ గాయత్రి, హరి, టీ హరిహర, ఎం పెంచలస్వామి పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

జలదంకి: మండలంలోని చామదల, బ్రాహ్మణక్రాక, జలదంకి తదితర గ్రామాల్లో పోలేరమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. తమ కుటుంబాలు చల్లగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వేడుకగా బాలచౌడేశ్వరీదేవి జయంతి



కడవబాణం ఊరేగింపు



విశేషాలంకారంలో బాలచౌడేశ్వరీదేవి

సంగం: తొగటవీర క్షత్రీయుల ఆరాధ్య దైవమైన బాలచౌడేశ్వరీదేవి జయంతిని సంగంలో ఆదివారం వేడుకగా నిర్వహించారు. రాళ్లచెలిక ప్రాంతంలోని బాలచౌడేశ్వరీదేవి ఆలయంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. అలాగే కొత్తూరులోని బాలచౌడేశ్వరీదేవి ఆలయం వద్ద సాయంత్రం భారీ అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొగట వీరక్షత్రీయులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కడవబాణం కార్యక్రమం ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ నాయకులు సుకమంచి భాస్కర్ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

జీఓ నంబరు 77ను రద్దు చేయాలి



ఆత్మకూరురూరల్: జీఓ నంబర్ 77ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆంధ్ర విద్యార్థి సంఘ రాష్ట్రాధ్యక్షుడు మల్లవరపు అశోక్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎన్నికల ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జీఓను రద్దు చేసిన తరువాతే పీజీ కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

మహిళా జర్నలిస్టుపై కేసు నమోదు

కావలి: టీడీపీ కార్యకర్త ఫిర్యాదు మేరకు మహిళా జర్నలిస్టుపై కావలి రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు కావలి రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. కావలి మండలం తాళ్లపాళెంలో జరిగిన ఘర్షణలో ఒక కుటుంబానికి చెందిన తాతా, మనవరాలు గాయపడ్డారని చెప్పారు. వారు కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేరారని తెలిపారు. ఈ సమాచారాన్ని మహిళా జర్నలిస్టు సామాజిక మాధ్యమాల్లో పెట్టారని, దీని వల్ల తమ పార్టీకి నష్టం జరిగిందని అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కావలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆత్మకూరు అభివృద్ధికి రూ.12.80 కోట్లు

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరురూరల్: పట్టణంలో వివిధ అభివృద్ధి పనులను రూ.12.80 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆత్మకూరులో ఆదివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. తొలుత పట్టణానికి తాగునీటిని అందించే మంచినీటి శుద్ధి ప్లాంట్‌ను అధికారులు, నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు ప్రజలకు రానున్న 20 ఏళ్లలో తాగునీటి సమస్య తలెత్తకుండా రూ.9.04 కోట్ల అమృత్ నిధులతో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. రూ.22.81 లక్షలతో పట్టణంలోని డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రూ.3.18 కోట్లతో మురుగునీటిని శుభ్రం చేసేందుకు ఐదు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వివరించారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయిస్తామన్నారు. అలాగే పట్టణంలోని గురుకుల పాఠశాల రెండో ఫ్లోర్‌లో బీసీ బాలికల గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయించి ప్రిన్సిపల్ నియామకం కూడా చేపట్టామన్నారు. తొలి ఏడాది 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఒక్కో తరగతికి 40 మంది చొప్పున 160 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభిస్తామన్నారు. క్రమంగా ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేస్తామన్నారు. పట్టణం నుంచి నెల్లూరుపాళెం వైపు, బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి గుడి వైపు ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. బైపాస్ రోడ్డులో వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, తదితర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కాగా ఆత్మకూరు నడిబొడ్డున ఉన్న కొలగానిరామయ్య సత్రం స్థలాన్ని పలువురు కబ్జా చేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ స్థలం వివరాలను ఇప్పటికే పరిశీలించామని తెలిపారు. ఈ భూమిని ఆక్రమించిన నిజమైన పేదలను గుర్తించి వారికి వేరే ప్రదేశంలో ఇళ్ల స్థలాలు, ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా షాపింగ్ కాంప్లెక్ నిర్మించి దుకాణదారులకు గదులు కేటాయిస్తామన్నారు. ఈ స్థలాన్ని ఆక్రమించి బిల్డింగ్‌లు నిర్మించిన వారిని గుర్తించి తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఆర్డీఓ మధులత, మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కమిషనర్ ఫజులుల్లా, పబ్లిక్‌హెల్త్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జి మురళీకృష్ణ, జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



మొక్కలు నాటుతున్న స్నేహితులు

కావలి: విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1981 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. త్వరలో 50 ఏళ్లకు చేరనున్న తమ మైత్రి ప్రస్థానానికి గుర్తుగా పట్టణంలో మొక్కలు నాటి సంరక్షించాలని సంకల్పించారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్ మాట్లాడుతూ తాము 1976 నుంచి స్నేహాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు. తమ బృంద సభ్యుడు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లెబోయిన మురళీకృష్ణ సూచనల మేరకు గత కొన్ని వారాలుగా ప్రతి ఆదివారం తాము చదివిన విశ్వోదయ ప్రాంగణంలో మొక్కలు నాటి సంరక్షణ చేపడుతున్నామని వివరించారు. నెల్లూరులో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మురళీకష్ణ పెన్నా తీరంలో తన విద్యార్థులతో వందలాది మొక్కలు నాటించారని తెలిపారు. అతని స్ఫూర్తితో, అమ్మ పేరుతో ఓ మొక్క నాటమన్న ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మద్దూరుపాడులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని వివరించారు. ఇకపై తమ మిత్ర బృందంలోని సభ్యుల పుట్టినరోజు, వివాహ దినోత్సవం, తదితర సందర్భాల్లోనూ మొక్కలు నాటాలని సంకల్పించామని తెలిపారు. బృంద సభ్యుడు, కల్పకం బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ చీఫ్ ఇంజినీర్ రామమూర్తి మాట్లాడుతూ ఆక్సిజన్ పంచే, పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకోవడానికి అనుకూలంగా ఉండే వేప, కానుగ, రావి, గంగిరేణి వంటి స్వదేశీ మొక్కలతో పాటు పండ్ల మొక్కలను పెంచాలని సూచించారు. విషాన్ని వెదజల్లే విదేశీ మొక్కలను నిషేధించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దూబగుంట రవికుమార్, పేరమన సాయిబాబా, రోశిరెడ్డి, సత్యప్రసాద్, మణికుమార్, ద్రోణాదుల వెంకటరావు, సత్యనారాయణ, బాబురావు, నల్లూరు రవికుమార్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల కోసం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం విరాళాల సేకరణ చేపట్టారు. వెంకటేశ్వరపురం ప్రాంతంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు విరాళాల సేకరించారు. పార్టీ నేతలు మూలం ప్రసాద్, బయ్యన్న, వెంకటరత్నం పాల్గొన్నారు.

తమ్ముళ్లకు ఐవీఆర్‌ఎస్ టెన్షన్

- నామినేటెడ్ పదవులపై తమ్ముళ్ల ఆశలు
- సర్వేలో ఉత్తముడని తేలితేనే పదవి
- ఎంపికలో చంద్రబాబు మార్క్ రాజకీయం
- ఎన్నికల్లో కష్టపడిన వారి ఆశలపై నీళ్లు

సీతారామపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఎలాగైనా గట్టెక్కాలనే ఉద్దేశంతో ఓవైపు అలివిగాని హామీలిచ్చిన చంద్రబాబు మరోవైపు టీడీపీ కార్యకర్తలు, నాయకులకు నామినేటెడ్ పదవుల ఎరవేశారు. కూటమిని గెలిపిస్తే పార్టీకి చేసిన సేవలకు అనుగుణంగా నామినేటెడ్ పదవుల్లో నియమిస్తామంటూ ఆశలు కల్పించారు. దీంతో తమ్ముళ్లు కూడా ఎన్నికల్లో బాగానే కష్టపడ్డారు. టీడీపీ, జనసేన బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో తమను నామినేటెడ్ పదవులు వరిస్తాయని వారు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆ దిశగా తమ బయోడేటాలు సైతం సిద్ధం చేసుకున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో వారి ఆశలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నీళ్లు చల్లారు. టీడీపీ నిర్వహించే ఇంటరాక్టివ్‌వాయిస్ రెస్పాన్స్ సిస్టం(ఐవీఆర్‌ఎస్) సర్వేలో ఉత్తముడని తెలితేనే నామినేటెడ్ పదవి కట్టబెడతామంటూ సంకేతాలు ఇచ్చారు. దీంతో ఆశావహుల్లో ఒక్కసారిగా అలజడి మొదలైంది.

ప్రతి నియోజకవర్గంలో ఐదుగురిపై సర్వే

ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే టిక్కెట్ దక్కనివారికి, ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించిన వారికి నామినేటెడ్ పోస్టులు ఇచ్చేందుకు టీడీపీ అధిష్టానం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రస్థాయి పదవుల జాబితాలు ఇప్పటికే సిద్ధమైనట్లు సమాచారం. ఆగస్టులో కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించే అవకాశం ఉంది. వీటితో పాటు మిగిలిన పదవులకు స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సులతో పాటు సర్వే ద్వారా ఎంపిక చేస్తున్నారు. నియోజకవర్గ పార్లమెంటరీ, మండల, గ్రామస్థాయి పదవులకు సంబంధించి ఒక్కో నియోజకవర్గంలో ఐదుగురిపై సర్వే చేయిస్తున్నారు. పార్టీ శ్రేణులకు, ప్రజలకు నేరుగా ఫోన్లు చేసి ఎస్ఎంఎస్ లింకు ద్వారా నామినేటెడ్ పదవి ఆశిస్తున్న వారిపై అభిప్రాయాలు సేకరిస్తున్నారు. ఎవరైతే బాగుంటుందని ఆరా తీస్తున్నారు. ఈ పరిణామం ఆశావహుల్లో ఆందోళన కలిగిస్తోంది. పార్టీ కోసం లక్షలాది రూపాయలు నీళ్లప్రాయంగా ధారపోస్తే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వకుండా కొత్తవారికి కట్టబెట్టాలని చూడటమేంటంటూ అధినేత చంద్రబాబు తీరుపై పలువురు టీడీపీ నాయకులు ఎండగడుతున్నారు. ఐదేళ్లు పార్టీకి ఖర్చు పెట్టి జెండా మోసేందుకు తాము, పదవులు అనుభవించేందుకు ఇతరులు కావాలా...అంటూ అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.

మీకెంత..మాకింత

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నుంచి ఆయా నియోజకవర్గాల్లో ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ నేతలకే 60శాతం పదవులు కట్టబెడతామని తాజాగా మరో లీకు వదిలారు. మిగిలిన దాంట్లో ముప్పై శాతం జనసేన పార్టీకి, మరో పది శాతం బీజేపీకి కేటాయిస్తామని చెబుతున్నట్ల సమాచారం. ఈ ప్రకారం ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నందున 60 శాతం నామినేటెడ్ పోస్టులు టీడీపీకే దక్కనున్నాయి. మిగిలిన వాటిలో ముప్పై శాతం జనసేనకు, పది శాతం బీజేపీకి కేటాయించే అవకాశం ఉంది. దీంతో నామినేటెడ్ పదవులన్నీ తమకేనని ఆశాభావంతో ఉన్న టీడీపీ నాయకుల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది. పార్టీ విజయానికి అహర్నిశలు కష్టపడిన వారిని స్వయంగా గుర్తించాల్సిందిపోయి, ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఎంపిక చేస్తామనడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. పోనీ పదవులన్నీ తమకే వస్తాయనుకుంటే కొత్త ప్రతిపాదనతో తమ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఈ పరిణామం బీజేపీ నేతల్లో ఆగ్రహావేశాలు నింపుతోంది. జాతీయ పార్టీ నేతలకు పది శాతం సీట్లు మాత్రమే కేటాయించడంపై గుర్రుగా ఉన్నారు.

మల్చింగ్ సాగు..లాభాలు బాగు

- బహుళ ప్రయోజనాలు
- తెగుళ్లు, పురుగుల నివారణ సులభం
- కలుపు మొక్కలకు కళ్లెం
- తక్కువ నీటితో అధిక దిగుబడులు
- ఆసక్తి చూపుతున్న రైతులు



మల్చింగ్ ద్వారా మిరపసాగు




మల్చింగ్ ద్వారా బొప్పాయి సాగు

కలిగిరి: కాలానుగుణంగా వ్యవసాయ విధానాలు మారుతున్నాయి. సంప్రదాయ సేద్యాన్ని వీడి ఆధునికతను అందిపుచ్చుకుంటున్న రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతున్నాయి. కొందరు రైతులు మెట్టపంటల సాగులో మల్చింగ్ విధానాన్ని వినియోగిస్తూ అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలను గడిస్తున్నారు. ఈ విధానంలో డ్రిప్‌ను వినియోగించి తక్కువ నీటితోనే పంటలు పండించొచ్చు. మల్చింగ్‌తో కలుపు సమస్య ఉండదు. చీడపీడలు తక్కువగా ఉంటాయి. దీంతో మొక్కలు బాగా ఎదిగి అధిక దిగుబడులు వస్తుండడంతో రైతులు మల్చింగ్‌పై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఉద్యాన శాఖ వింజమూరు డివిజన్ పరిధిలోని కలిగిరి, వింజమూరు మండలాల్లోని రైతులు బొప్పాయి, అరటి, మిరప, కూరగాయలు, తదితర పంటలను మల్చింగ్ విధానంలో సాగుచేసేందుకు ముందుకు వస్తున్నారు. ఇక్కడి మెట్ట వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మల్చింగ్ విధానంలో పంటలు సాగుచేయడం ద్వారా రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

మల్చింగ్‌తో ప్రయోజనాలు

మల్చింగ్ ద్వారా పంటలను పండించడం వల్ల వర్షాభావ పరిస్థితుల్లో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్ పైపు వేయడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టు కింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. కలుపును నివారించడం ద్వారా కూలీల ఖర్చు తగ్గుతుంది. మల్చింగ్ వల్ల భారీ వర్షాలు కురిసినా తెగుళ్లు తక్కువగా సోకుతాయి. డ్రిప్ ద్వారా వేసే ఎరువులు మొక్కకు బాగా అందుతాయి. తద్వారా పంట బాగా వచ్చి దిగుబడులు పెరుగుతాయి.


కలుపు బెడద ఉండదు



మల్చింగ్ షీట్ ద్వారా మిరప, దోస, దొండ పంటలను సాగు చేస్తున్నాను. దీని వలన కలుపు బెడద ఉండదు. కూలీల భారం తగ్గుతుంది. తక్కువ నీటితో పంటలను సాగు చేసుకోవచ్చు.

– అక్కెం హజరత్‌రెడ్డి, నాగిరెడ్డిపాళెం

రైతులకు ప్రయోజనం



మల్చింగ్ విధానంతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చు. తక్కువ నీటితో పంటలను పండించవచ్చు. మల్చింగ్ షీట్‌ను ఉపయోగించి సాగు చేయడం ద్వారా పంటలు బాగా వస్తాయి. దిగుబడులు పెరుగుతాయి. పెట్టుబడులు తగ్గుతాయి. మల్చింగ్ విధానంపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

–షేక్ షహీల్, ఉద్యాన శాఖ అధికారి, వింజమూరు